క్లుప్తంగా

నూతన చట్టాలపై పరిజ్ఞానం పెంచుకోవాలి

అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: నూతన చట్టాలపై ప్రతీ ఒక్కరూ పరిజ్ఞానం పెంచుకోవాలని సిద్దిపేట అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి అన్నారు. నూతన చట్టాలపై సీపీ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 15 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామన్నారు. నూతన చట్టాలపై ప్రజలకూ అవగాహన కల్పిస్తామని తెలిపారు. జులై 1వ తేదీ నుంచి మూడు చట్టాలు అమలులోకి రానున్నాయన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. త్వరలో నూతన చట్టాలకు సంబంధించిన బుక్స్ సిబ్బందికి అందజేస్తామన్నారు. సమావేశంలో సీఐలు శ్రీధర్, కమలాకర్, ప్రవీణ్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జానీపాషా



నియామక పత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు

గజ్వేల్: సిద్దిపేట జిల్లా యువజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా గజ్వేల్ పట్టణానికి చెందిన జానీ పాషా నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేతుల మీదుగా హైదరాబాద్‌లో నియామక పత్రం అందుకున్నట్లు జానీ పాషా తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్‌గా సంతోష్ గుప్తా

గజ్వేల్: లయన్స్ క్లబ్ సిద్దిపేట జిల్లా రీజియన్ చైర్మన్‌గా గజ్వేల్ పట్టణానికి చెందిన గోలి సంతోష్ గుప్తా నియమితులయ్యారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానన్నారు. ప్రధానంగా గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ భవన నిర్మాణం, ప్రజ్ఞాపూర్‌లోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో బస్ షెల్టర్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.

క్రీడాపాఠశాలలకు ఎంపిక పోటీలు

అక్కన్నపేట(హుస్నాబాద్): 24వ తేదీన మండల స్థాయి క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలను మండలంలోని మల్లంపల్లి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి అమ్మన ఉదయ్ భాస్కర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2015 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31వ తేదీలోపు జన్మించిన వారై, 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు పోటీల కన్వీనర్ జంగపల్లి వెంకట నర్సయ్య, మండల నోడల్ ఆఫీసర్ రంగానాయక్ సంప్రదించాలన్నారు.

ప్రభుత్వానికి వినతి

గజ్వేల్‌రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని సంచార పశువైద్య వాహన సిబ్బంది ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం గజ్వేల్‌లో పలువురు మాట్లాడారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉంటున్నామని, కొన్ని నెలలుగా వేతనాలు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ వైర్ల చోరీ

దుబ్బాకరూరల్: విద్యుత్ వైర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ గంగరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆకారం శివారులో 350 మీటర్ల ఏబీ కెబుల్ వైర్ చోరీ చేశారు. దీని విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని, ఏఈ రామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేటలోని భారత్ పెట్రోల్ బంక్ సమీప పంతుల్ తండా మూలమలుపు క్రాసింగ్ వద్ద ఇటీవల ప్రైవేట్ ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటన తెలిసిందే. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతల మల్లారెడ్డి తెలిపారు.



గజ్వేల్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి



బాలసదనంలో..



జక్కాపూర్‌లో ..

యోగాతో మానసిక ప్రశాంతత

- మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత



హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు కట్టపై యోగా చేస్తున్న యువతీ యువకులు

హుస్నాబాద్: మానసిక ప్రశాంతత పొందాలంటే యోగా జీవితంలో భాగం కావాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్లమ్మ చెరువు కట్టపై యోగా డే నిర్వహించారు. యోగా టీచర్ అయిలేని అనిత యువతీ యువకులు, మహిళలు, పురుషులతో యోగాసనాలు, ధ్యానం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందుతామని ప్రిన్సిపల్ సివిల్ జూనియర్ జడ్జి శివరంజని అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో అంతర్జాతీయ యోగా డే నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీపీ కన్నోజు రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌లో..

గజ్వేల్: యోగా జీవితంలో భాగం కావాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో యోగా డే నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ దేవరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సిద్దిపేటరూరల్: రోజూ యోగా చేస్తే ఆరోగ్యంగా ఉంటామని యోగా, ఫిజికల్ డైరెక్టర్ సతీష్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా డే సందర్భంగా నారాయణరావుపేట హైస్కూల్, ఇర్కోడ్ ఆదర్శ పాఠశాల, జక్కాపూర్ పాఠశాలలో ఘనంగా యోగా డే నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ బుచ్చిబాబు, కనకయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): అంతర్జాతీయ యోగా డేని శుక్రవారం మండలంలో నిర్వహించారు. కార్యక్రమాలలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా సీఎస్‌సీ డీఎం శ్రీనివాస్, కరస్పాండెంట్ ప్రకాష్, ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, సీఎస్‌సీ వీఎల్ఈ మానాల తిరుమల, రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాల్లో శుక్రవారం యోగా డే నిర్వహించారు. యోగా ప్రయోజనాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

అక్కన్నపేటలో..

అక్కన్నపేట(హుస్నాబాద్): అంతర్జాతీయ యోగా డేని శుక్రవారం అక్కన్నపేటతో పాటు మల్లంపల్లిల్లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. అక్కన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగా ఆకృతిలో కనువిందు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రంగనాయక్, సంధ్యారాణి, ఎంపీడీఓ భానోతు జయరాం పాల్గొన్నారు.



జప్తిలింగారెడ్డిపల్లిలో..



దుబ్బాకలో ..

బాలసదనంలో..

సిద్దిపేటజోన్: అంతర్జాతీయ యోగా డే కార్యక్రమాన్ని సిద్దిపేటలోని బాల సదనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శారద మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రోజూ యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాము తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మేలు

దుబ్బాక: యోగాతో మానసికంగా, శారీరకంగా మనకు ఎంతో మేలు జరుగుతుందని జడ్జి తరణి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా డే సందర్భంగా కోర్టు ఆవరణలో ప్రముఖ యోగా గురువు దయాకర్‌జీ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేబర్తి గ్రామంలో..

మద్దూరు(హుస్నాబాద్): క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే మానసికంగా ఒత్తిని జయించవచ్చని ఎంపీడీఓ రామ్మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని రేబర్తిలో ఉపాధి హామీ కూలీలతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజామొయినుద్దీన్, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కమిషనర్ కార్యాలయ ఆవరణలో..

సిద్దిపేటకమాన్: యోగా సాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సిద్దిపేట ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచందర్‌రావు అన్నారు. అంతర్జాతీయ యోగా డేని పోలీసు కమిషనర్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ యోగా శిక్షకురాలు అరుణ యోగా సాధనతో కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ మధు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొంత సమయం కేటాయించాలి

సిద్దిపేటకమాన్: ప్రతీ ఒక్కరూ కొంత సమయాన్ని యోగా సాధనకు కేటాయించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. సిద్దిపేట జిల్లా కోర్టులో అంతర్జాతీయ యోగా డేని శుక్రవారం నిర్వహించారు. యోగా గురువు అశోక్ పలు ఆసనాలను నేర్పించారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

గజ్వేల్‌రూరల్: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని గజ్వేల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ప్రియాంక పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో అంతర్జాతీయ యోగా డే నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, బాలల సంక్షేమ సమితి జిల్లా కమిటీ సభ్యులు దేశబోయిన నర్సింలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈజీఎస్ కూలీలకు..

తొగుట(దుబ్బాక): మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి గ్రామంలో ఈజీఎస్ కూలీలతో యోగాసనాలు వేయించారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా డే సందర్భంగా యోగా శిక్షకుడు కడారి నరేంద్ర యోగాపై అవగాహన కల్పించారు. యోగా సాధనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సొంత ఖర్చుతో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకారాదన్నారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సన్మార్గంలో నడిచేలా ఉపాధ్యాయులతో పాటు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కాగా పాఠశాలకు రూ. 10 వేల విలువ కలిగిన మైక్ సెట్‌ను కానుకగా అందించిన మండల నోడల్ అధికారి అంజయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ గౌతమి, ప్రధానోపాధ్యాయుడు కిషన్, స్కూల్ టీచర్లు శ్రీనివాస్, కరుణాకర్, శ్రీవిద్య, రాజేశ్వరి, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు అయితం శ్రీనివాస్, ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

నిజాయితీ చాటుకున్న మున్సిపల్ ఉద్యోగి

చేర్యాల(సిద్దిపేట): సోషల్ మీడియా ద్వారా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ఆచూకీ తెలుసుకున్నాడు. అతడికి ఫోన్ అందజేసి మున్సిపల్ కార్యాలయ ఆర్ఐ దబ్బెట కృష్ణ నిజాయితీ చాటుకున్నాడు. బచ్చన్నపేట గ్రామానికి చెందిన నరేందర్ చేర్యాల వచ్చి తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆ ఫోన్ కృష్ణకు దొరకడంతో వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశాడు. పోగొట్టుకున్న వ్యక్తి ఆచూకీ తెలుసుకొని అందజేశాడు. కృష్ణకు నరేందర్ కృతజ్ఞతలు తెలిపాడు.



ఫోన్ అందజేస్తున్న కృష్ణ

సంక్షిప్త వార్తలు

◆ **మృతుల కుటుంబాలకు పరామర్శ**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం శివారు రామసాగరం, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను శుక్రవారం మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించి ఓదార్చారు. బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు తిరుపతి భార్య నర్మద, లక్ష్మీపూర్‌లో ముక్కిస నిలాంబర్‌రెడ్డి మృతిచెందారు. ఆ రెండు కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అండగా ఉంటామన్నారు.

◆ **విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి**

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు గుజ్జ రాజు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలు, కళాశాలల్లో ఫీజులు నియంత్రించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా పాఠ్యపుస్తకాలు రాలేదన్నారు. వెంటనే ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలన్నారు.

◆ **అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): అందివచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు అన్నారు. అనంతరెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ జి.మాధవరెడ్డి సహకారంతో మండల పరిధిలోని అల్వాల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 75 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. ప్రతిభ కనబరుస్తున్న 5వ తరగతి విద్యార్థిని కె.ప్రణవితకు రూ.2500, ఆయేషా నాజ్‌కు రూ.1500 నగదు పురస్కారాన్ని ట్రస్ట్ తరపున అందించారు.

◆ **ఐదుగురు విధుల్లో చేరిక**

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయుల కొరత తీరిందని హెచ్‌ఎం నయీమా కౌసర్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ పదోన్నతుల్లో భాగంగా ఐదుగురు ఉపాధ్యాయులు శుక్రవారం విధుల్లో చేరారని తెలిపారు. జి.మనోహర్ (సాంఘిక శాస్త్రం), సుధాకర్ (జీవ శాస్త్రం), ఎల్లయ్య (తెలుగు), ఎం.శంకర్ (హిందీ), కనకయ్య పీఈటీగా చేరారన్నారు.

◆ **జూనియర్ లైన్‌మెన్‌కు మెమో**

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని ఐనాపూర్, తపాస్‌పల్లి రైతులను ఇబ్బంది పెట్టడమేకాకుండా, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జూనియర్ లైన్‌మెన్ రమేష్‌కు మెమో జారీ చేయడంతో పాటు కట్టర్ నర్సింహులును విధుల నుంచి తొలగించినట్లు చేర్యాల ఏడీఈ రత్నవీరాచారి శుక్రవారం తెలిపారు. రమేష్, నర్సింహులు వ్యవహార శైలిపై రెండు రోజుల క్రితం ఐనాపూర్ మాజీ సర్పంచ్ రమణారెడ్డితో పాటు పలువురు రైతులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

◆ **గ్రూప్2 పోస్టులు పెంచాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గ్రూప్ 2 పోస్టులను పెంచాలని బీఆర్‌ఎస్వీ పట్టణ అధికార ప్రతినిధి మెరుగు మాధవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో నిరుద్యోగులు ఉన్నారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పోస్టులు పెంచాలన్నారు.

◆ **హామీలు అమలు చూడండి**

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపల్‌లో అవినీతి అంటూ ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు ముందు ప్రభుత్వం హామీలను అమలు చేసేలా చూడాలని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ యువత అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడారు. స్వార్థ రాజకీయాల కోసం పార్టీ మారిన కౌన్సిలర్లు మున్సిపల్‌లో అవినీతి, అక్రమాలు అని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

వైద్యం కోసం నిరీక్షణ

- సకాలంలోరాని సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కోసం ఎదురు చూస్తున్న రోగులు

అక్కన్నపేట(హుస్నాబాద్): సర్కారు వైద్యాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. నిధులు కేటాయిస్తూ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోంది. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంది. అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావడంలేదు. శుక్రవారం ఉదయం 11 గంటలు దాటినా ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్ బాబురావు తప్ప ఎవరూ రాలేదు. పంతుల్‌తండా గ్రామం, బొత్తలపర్రె, మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల నుంచి దాదాపు ఎనిమిది మంది వైద్యం చేయించుకునేందుకు ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. సిబ్బంది రాకపోవడంతో వారి కోసం చాలా సేపు నిరీక్షించారు. చివరకు హెల్త్ అసిస్టెంట్ బాబురావు రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశాడు.

అధికారుల ఆదేశాలు బేఖాతరు

ఇటీవల ఆరోగ్య కేంద్రానికి తనిఖీ చేసిన జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓ శ్రీనివాస్ గ్రామీణ ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అయితే సిబ్బంది 11 గంటలు దాటినా కేంద్రానికి రాకపోవడం గమన్హారం. కేంద్రంలో ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉండగా ఒకరు మెడికల్, మరొకరు సెలవులో ఉన్నారు. ఫార్మసిస్ట్ ఇటీవల డిప్యూటేషన్‌పై వెళ్లారు. ల్యాబ్ టెక్నీషియన్ లేరు. ఈ విషయంపై సాక్షి వైద్యాధికారి రమ్యను సంప్రదించగా సిబ్బంది అంతర్జాతీయ యోగా డే పాల్గొన్నట్లు తెలిపారు.

నీట్ పరీక్ష రద్దు చేయాలని రాస్తారోకో

అక్కన్నపేట(హుస్నాబాద్): పేపర్ లీకేజీలతో కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని, వెంటనే నీట్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే నీట్ పరీక్ష ఒకటన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతల మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వేముల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



అక్కన్నపేటలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



సిద్దిపేటలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ జాతిపిత, సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చాట్లపల్లి బాలమల్లేశం గౌడ్ పాల్గొన్నారు.

ప్రజల మనసు గెలుచుకున్న మహనీయుడు

హుస్నాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అవిశ్రాంతంగా ఉద్యమించి ప్రజల మనసును గెలుచుకున్న మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని అఖిల భారత విశ్వకర్మ పరిషత్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో శుక్రవారం జయశంకర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ జయశంకర్ ఆశయాలను విద్యావంతులు, రాజకీయ నాయకులు ముందుకు తీసుకెళ్లాలని కోరాడు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు సుదర్శనచారి, నాయకులు తదితరులు ఉన్నారు.

డీడీఎఫ్ ఆధ్వర్యంలో..

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్టలో డీడీఎఫ్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాచగోని పద్మవెంకట్‌గౌడ్, చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బావండ్లపల్లి కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ పోతరాజు మధు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో..

సిద్దిపేటజోన్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని శుక్రవారం సిద్దిపేటలో నిర్వహించారు. ముస్తాబాద్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, వైస్ చైర్మన్ కనకరాజు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలకు అనుగుణంగా జయశంకర్ మలిదశ తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు వెన్నంటి ఉన్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సుందర్, యోగి, బ్రహ్మం, నాగరాజు రెడ్డి, విశ్వకర్మ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

కోహెడ(హుస్నాబాద్): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 13వ వర్ధంతి కార్యక్రమాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడిశెట్టి రాజు పూలమాల వేసి నివాళి అర్పించారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి



రాజయ్య (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ఎద్దు పొడవడంతో తీవ్రంగా గాయపడిన సమైక్యతా కేంద్రం యంఎల్ పార్టీ నాయకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అక్కన్నపేట మండలం మంచినీళ్లబండ గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోయిని రాజయ్య(49) సమైక్యతాకేంద్రం యంఎల్ పార్టీ నాయకుడు. ఎద్దు పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. రాజయ్య మృతి తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వెంకట్రాది అన్నారు.

గట్లమల్యాలలో రైతు



వెంకటయ్య (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్యకు యత్నించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజగోపాల్‌పేట ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గట్లమల్యాలకు చెందిన రైతు గజ్వెల్లి వెంకటయ్య (67) వ్యవసాయం చేస్తున్నాడు. గత ఏడాది అప్పుచేసి బోరు వేసినా నీరు పడలేదు. పంటసాగు చేసేందుకు డబ్బులు లేవని మనస్తాపం చెందాడు. మంగళవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుమారుడు పరమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు



మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి నల్లపోచమ్మ చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలించిన వారిపై చర్యలు తీసుకుంటామని రెవెన్యూ, ఐబీ అధికారులు అన్నారు. శుక్రవారం నల్లపోచమ్మ చెరువును ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చెరువు నుంచి కొందరు మట్టిని అక్రమంగా తరలించినట్లు వచ్చిన సమాచారం మేరకు పరిశీలించామన్నారు. మట్టి తరలింపుపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఐబీ ఏఈ నర్సింహులు, ఆర్ఐ రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.